క్లుప్తంగా

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పద్మ



సత్తెనపల్లి:పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కొండవీటి పద్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రసాయన శాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తూ పదోన్నతిపై సత్తెనపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆమె వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎఫ్‌ఏసీ ప్రిన్సిపాల్ ఉపసర్తి కోటేశ్వరమ్మ ప్రకాశం జిల్లా పొదిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్ కొండవీటి పద్మను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది కలిసి ప్రత్యేకంగా అభినందించారు.

ఒలింపియాడ్ మ్యాథమెటికల్‌లో సుదీప్య ప్రతిభ



సత్తెనపల్లి: ఇటీవల ప్రకటించిన స్నాప్స్ కౌన్సిల్ ఫర్ అకాడమిక్ పొటెన్షియల్ స్టూడెంట్స్ వారి రీజినల్ ఒలంపియాడ్ మ్యాథమెటికల్‌లో పల్నాడు జిల్లా సత్తెనపల్లి నారాయణ పాఠశాలకు చెందిన కడివెండి సుదీప్య ప్రతిభ చూపి ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం తన కార్యాలయంలో ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

కరుణ సాగరుడుగా శ్రీవారు



సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో గల అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం శ్రీవారిని కరుణ సాగరుడు గా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను శ్రీవారి సేవకులు పర్యవేక్షించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సత్తెనపల్లి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామానికి చెందిన ఇస్తల వెంకట్రావు (38) ఈ నెల 11న పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. మోటార్ ఆన్ చేసినా నీళ్లు రాకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి పరిశీలిస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వైద్యశాలకు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. మృతుని తండ్రి చంద్రమౌళి ఫిర్యాదు మేరకు సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు.

రచయిత్రి రమాదేవికి అవార్డు ప్రదానం



సత్తెనపల్లి:అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన రచయిత్రి డాక్టర్ సరికొండ రమాదేవికి భారత్ విభూషణ్ అవార్డును ప్రదానం చేశారు. ఆమె సాహితీ సేవల్ని దృష్టిలో పెట్టుకొని అవార్డ్, సర్టిఫికెట్ ఇచ్చి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సోమవారం రమాదేవిని సత్తెనపల్లిలోని వివిధ సంస్థల అధినేతలు, కార్యదర్శులు ప్రత్యేకంగా అభినందించారు.

29న దొడ్లేరులో జాబ్‌మేళా

క్రోసూరు: పెదకూరపాడు నియోజకవర్గ నిరుద్యోగ యువతీ, యువకుల కోసం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో ఈనెల 29న మండలంలోని దొడ్లేరులో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన కార్యాలయ ప్రతినిధి సోమవారం తెలిపారు. దొడ్లేరులోని రావిపాటి కల్యాణ మండపంలో ఉదయం 9 గంటల నుంచి ఎంపికలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అమరావతి ఎస్ఐగా అమీర్



అమరావతి: అమరావతి సబ్ ఇన్‌స్పెక్టర్‌గా కె. అమీర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో తెనాలిరూరల్, రాజుపాలెం, బెల్లంకొండ, పిడుగురాళ్ల, కారంపూడిలలో పని చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం అమీర్ మాట్లాడుతూ మండల పరిధిలో శాంతిభద్రతలు కాపాడటానికి ప్రజలతో మమేకమై, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, అన్ని శాఖల అధికారులతో సమన్వయంతో పని చేస్తానని తెలిపారు.

అండర్ పాస్ బ్రిడ్జీలతో అవస్థ

- తక్కువ ఎత్తులో నిర్మాణం
- ఇబ్బంది పడుతున్న పలు గ్రామాల ప్రజలు, రైతులు
- గతంలో నిర్మించిన బ్రిడ్జీల్లో నాలుగడుగుల లోతు నీరు నిల్వ
- రెల్వే అధికారుల నిర్లక్ష్యం
- పలు గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బంది



గతంలో నిర్మించిన బ్రిడ్జి వద్ద నిలిచిన నీరు

రాజుపాలెం: రైల్వే అధికారుల అనాలోచిత ధోరణి కారణంగా 15 గ్రామాల రాకపోకలను నిలిపేసింది. కొండ నాలుకకు మందు వేస్తే ఉండ నాలుక ఊగిందన్న చందాన అధికారుల మొండి వైఖరితో ఆయా గ్రామాలకు రవాణా సౌకర్యం లేకుండాపోయింది. ముందు చూపుతో గత వైఎస్సార్ ప్రభుత్వం హయాంలో తీసుకున్న నిర్ణయాన్ని అధికారులు బేఖాతరు చేశారు. మొండిగా చేపట్టిన నిర్మాణంతో రవాణాకు అడ్డంకిగా మారింది. వివరాలలోకి వెళితే.. మండలంలోని మాచర్ల–గుంటూరు రహదారిపై రెడ్డిగూడెం వద్ద నుంచి బ్రాహ్మణపల్లి, మొక్కపాడు, నాగవరం, గరికపాడు, హసాన్‌బాద్, దొడ్లేరు తదితర గ్రామాలకు వెళ్లేందుకు గతంలో తారు రోడ్డు వేశారు. సత్తెనపల్లికి, గుంటూరు, మాచర్ల వెళ్లడానికి ఈ మార్గం నుంచే రాకపోకలు సాగిస్తారు. గతంలో సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుంచి బస్సు సౌకర్యం కూడా ఉంది. రెడ్డిగూడెం సమీపంలో ఆయా గ్రామాలను కలిపే తారురోడ్డుపై రైల్వే లైన్ ఉండడంతో గేటును(నంబర్ 50) ఏర్పాటు చేశారు. ఎన్నో ఏళ్లుగా ఈ రైల్వే గేటు నుంచే ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. గేటు స్థానంలో అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులు సర్వే చేసినప్పటికీ అప్పటి రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు, తహసీల్దార్లు నిర్మించేందుకు అంగీకరించలేదు. అయినా రైల్వే అధికారులు మొండి పట్టుదలతో అండర్ ప్రాసెస్ బ్రిడ్జీలను ఏర్పాటు చేశారు.

ఉపయోగం లేని బ్రిడ్జిలతో అవస్థలు తప్పవు

అండర్ పాస్ బ్రిడ్జీలను తక్కువ వెడల్పు, ఎత్తులో నిర్మించడం వల్ల ఇబ్బందులు తప్పడు. పది అడుగుల వెడల్పు , 15 అడుగుల ఎత్తుతో ఏర్పాటు చేయడం వల్ల ఆర్టీసీ బస్సులు, ధాన్యం లారీలు, భారీ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించినప్పటికీ రైల్వే గేటు ఉంచితే భారీ వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా ఉంటుంది. లేనిపక్షంలో ఇరుకు అండర్ పాస్‌తో ప్రజలు నానా అవస్థలు పడతారు.

తటాకాల్లా మారుతున్న అండర్ పాస్‌లు

మండలంలో అనుపాలెం నుంచి కోనంకి వెళ్లే రహదారిపై గేటు తొలగించి రైల్వే ట్రాక్ కింద అండర్ పాస్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. అనుపాలెం రైతులు పొలాలకు వెళ్లే రోడ్డుపై రెండు గేట్లు తొలగించి అక్కడ అండర్ పాస్‌లు నిర్మించారు. చౌటపాపాయపాలెం నుంచి మాచర్ల–గుంటూరు రహదారికి వచ్చేందుకు గేటు తొలగించి దాని స్థానంలో బ్రిడ్జిని నిర్మించారు. ఇదే విధంగా మొక్కపాడు నుంచి మాచర్ల–గుంటూరు రహదారికి వచ్చేందుకు గేటును తొలగించి అండర్ పాస్‌ను నిర్మించారు. ఈ బ్రిడ్జిల వద్ద నిత్యం నాలుగడుగుల నీళ్లు నిలబడడంతో రాకపోకలకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.



రెడ్డిగూడెం రైల్వే గేటు

ఇబ్బంది పడుతున్న పలు గ్రామాల ప్రజలు



అండర్ పాస్ బ్రిడ్జీల వల్ల ప్రజలు రాకపోకలకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. గేటుకు పర్లాంగు దూరంలో మా గ్రామం ఉంది. అండర్ పాస్ బ్రిడ్జీల వల్ల రవాణా సౌకర్యం చాలా దెబ్బతింది. బస్సులు, పెద్ద వాహనాలు రావాలంటే 20 కిలో మీటర్లు చుట్టూ తిరిగి రావాల్సి ఉంటుంది. రైల్వే అధికారులు సర్వే చేయకుండా బ్రిడ్జీలు నిర్మించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైల్వే గేటు కూడా ఉంచాలని కోరుతున్నా.

–ఓర్సు వెంకటపతి , సర్పంచ్, బ్రాహ్మణపల్లి

మొండిగా వ్యవహరించిన రైల్వే అధికారులు



మండలంలో ఆరేళ్ల కిందట ఐదు అండర్ పాస్ బ్రిడ్జీలు చేపట్టారు. ఆ సమయంలో నేను సర్పంచ్‌గా ఉండి పూర్తిగా వ్యతిరేకించా. ధర్నాలు, రాస్తారోకోలు చేశాం. అయినా రైల్వే అధికారులు పట్టించుకోకుండా బ్రిడ్జీలు ఏర్పాటు చేశారు. వాటిల్లో నిత్యం నాలుగడుగుల లోతు నీళ్లు ఉండడంతో రాకపోకలకు ఉపయోగంగా లేదు. బ్రిడ్జీల నుంచి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. రైల్వే అధికారులకు ప్రజల శ్రేయస్సు అవసరం లేదు. రెడ్డిగూడెం గేటును తొలగిస్తే రవాణా సౌకర్యానికి ఇబ్బందులు వస్తాయి. యథావిధిగా గేటు ఉంచాలి.

– బండి కోటినాగిరెడ్డి, మాజీ సర్పంచ్

పురుగు మందులతో వాతావరణం కలుషితం



అచ్చంపేటలో మామిడి మొక్కలు నాటుతున్న ఏరువాక అగ్రి ప్రొడ్యూసర్స్ కంపెనీ ప్రతినిధులు, రైతులు

అచ్చంపేట: పంటలపై విచ్చలవిడిగా పురుగు మందులు వాడటం వల్ల వాతావరణం కలుషితమవుతుందని ఏరువాక అగ్రి ప్రొడ్యూసర్స్ కంపెనీ ప్రతినిధి శిఖా నరసింహారావు సూచించారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా సోమవారం అచ్చంపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారత మాజీ ప్రధాని చరణ్‌సింగ్ దేశంలో మొట్టమొదటిసారిగా కౌలుదారి చట్టం, రాజభరణాలరద్దు లాంటి రైతుల సమస్యలపై పోరాడినందుకుగాను ఆయన జన్మదినోత్సవాన్ని రైతు దినోత్సవంగా జాతీయస్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణానికి హాని కలుగకుండా వ్యవసాయ విధానాలను పాటించాలని సూచించారు. ముఖ్యంగా సేంద్రియ వ్యవసాయ విధానాలను పాటించాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పోలిశెట్టి భాస్కరరావు, సాగునీటి సంఘం అధ్యక్షులు శ్రీనివాసరావును జ్ఞాపికలు, శాలువాలతో సత్కరించారు. పలు ప్రాంతాలలో మామిడి మొక్కలను నాటారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, టీడీపీ మండల అధ్యక్షులు నందిగం ఆశీర్వాదం, తిరువాయిపాటి ఆంజనేయులు, డ్రైలాండ్ ప్రతినిధి ఎస్.హరిత, ఏరువాక డైరెక్టర్ బి.రవినాయక్, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక సంస్కరణల పితామహుడు పీవీ

ఎమ్మెల్యే కన్నా



పట్టణంలో పీవీ విగ్రహం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి: భారతదేశ ఆర్థిక సంస్కరణల పితామహుడు మాజీ ప్రధాని భారతరత్న పీవీ నరసింహారావు అని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. బ్రాహ్మణ ఐక్య వేదిక సత్తెనపల్లి డివిజన్ ఆధ్వర్యంలో పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో గల పీవీ నరసింహారావు విగ్రహం వద్ద సోమవారం నిర్వహించిన వర్ధంతిలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారతదేశ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్ది ప్రాణం పోసిన అపరచాణిక్యుడిగా పీవీ నరసింహారావు నిలిచారని పేర్కొన్నారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ ఐక్యవేదిక సత్తెనపల్లి డివిజన్ అధ్యక్షుడు పెద్దింటి ఫణి కృష్ణ, సెక్రటరీ కొడవటిగంటి నాగ పార్వతీయశర్మ, కోశాధికారి ఆంపీరాయిని రాజశేఖర్, విఖనస మండలి సభ్యులు తులసీ కృష్ణ , వేదాంతం రమణాచార్యులు, వేదాంతం తేజ, రొంపిచర్ల ఆంజనేయచార్యులు, ఆదిశైవ సంఘం సభ్యులు కొండకావూరి మార్కండేశ్వరశర్మ, కారంచేటి శ్రీనివాసరావు, మాటేటి హనుమంతరావు, డాక్టర్ గుండ్లపల్లి శ్రీధర్, ఆమంచి రవికుమార్, కోనకి మారుతి, కేకే విశ్వనాథ్ , పురోహిత సంఘ సభ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ



దస్తులు అందచేస్తున్న ఉపాధ్యాయుడు గోవిందరెడ్డి, కుటుంబసభ్యులు

అందుకూరు(క్రోసూరు): క్రిస్మస్ పండుగ సందర్భంగా మండలంలోని అందుకూరు ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయుడు గోవిందరెడ్డి కుటుంబీకులు సోమవారం పాఠశాలలోని పేద విద్యార్థులకు నూతన దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడి కుమార్తె బూతుకూరి సుమతి, అల్లుడు కైపు రామకృష్ణారెడ్డి, మనవళ్లు జస్వంత్ రెడ్డి, నిర్విత్‌శ్రీ , ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శత జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అరసం రాష్ట్ర కార్యదర్శి కొమ్మాలపాటి శరత్ తదితరులు

అమరావతి: ప్రజల హక్కుల కోసం పోరాటాలతో పాటు దేశాభివృద్ధిలో ప్రధాన భూమిక నిర్వహిస్తున్న సీపీఐ శత జయంతి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని అరసం రాష్ట్ర కార్యదర్శి కొమ్మాలపాటి శరత్ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన పెదకూరపాడు నియోజకవర్గ కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. సమావేశానికి సీపీఐ మండల కార్యదర్శి కారంపూడి చెన్నకేశవరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ మతోన్మాదులకు సీపీఐ అడ్డుకట్ట వేస్తూ ప్రజలతో మమేకమై, సమస్యలపై నిరంతరం పోరాడుతోందని తెలిపారు. సీపీఐ పెదకూరపాడు నియోజకవర్గ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదలు, బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజా పోరాటాలలో ప్రధాన భూమిక నిర్వహించిన సీపీఐ జెండాలను ప్ర తి శాఖలో ఆవిష్క రించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి భైరా పట్నం రామకృష్ణ, సీపీఐ నాయకులు పాల్గొన్నారు

క్రీస్తు జననంతో లోకానికి రక్షణ



సత్తెనపల్లిలోని వృద్ధాశ్రమంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న డీఎస్పీ హనుమంతురావు



సత్తెనపల్లిలోని ఇరిగేషన్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఈఈ మురళీధర్

సత్తెనపల్లి: ఏసుక్రీస్తు మార్గం అనుసరణీయమని సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు అన్నారు. పట్టణంలోని గుంటూరు రోడ్‌లో గల ఆదరణ అనాథల వృద్ధాశ్రమంలో సోమవారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీస్తు జననం లోక రక్షణకు మార్గంగా నిలిచిందని తెలిపారు. వేడుకల్లో సంజన వైద్యశాల వైద్యులు డాక్టర్ జి. శ్రీధర్, న్యాయవాది బగ్గి నరసింహారావు మాట్లాడారు. ముందుగా క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 200 మంది అనాథలకు వస్త్రాలు, 500 మంది పేదలకు అన్న సంతర్పణ చేశారు. ఆశ్రమ నిర్వాహకుడు డాక్టర్ కె.ఇంద్రసేన మాట్లాడుతూ ఆశ్రమంలోని ప్రతి ఒక్కరికీ క్రీస్తు ప్రేమ చూపడమే తమ కర్తవ్యమని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు పెద్దింటి నాగేశ్వరరావు, చిలుక అగస్టస్‌బాబు, సత్య కిరణ్, జాన్సన్ పాల్గొన్నారు.

ఇరిగేషన్ కార్యాలయంలో....

పట్టణంలోని ఇరిగేషన్ కార్యాలయ ఉద్యోగులు సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళీధర్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జేటీఓ అరుణ్, వర్క్ చార్జ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఎం. మరియదాసు, పాస్టర్ టి. సాల్మన్ రాజు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసోసియేషన్ సభ్యులు, సిబ్బంది, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లస్కర్లు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

సత్తెనపల్లి: పట్టణంలోని భవిత కేంద్రంలో సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మంచి పనులు చేస్తూ ఇతరులకు సహాయం చేయాలని తెలిపారు. భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ ప్రతి సోమవారం జరుగుతుందని, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ముందుగా క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. భవిత కేంద్రం ఐఈ రిసోర్స్ పర్సన్ ఏ.వి. శ్రీనివాస్ మాట్లాడుతూ శాంతం, దయ, విశ్వాసములతో జీవించటమే నిజమైన క్రిస్మస్ అన్నారు .కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ కె. ప్రశాంతి, టీచర్ జ్యోతి, ప్రత్యేక అవసరాల పిల్లలు పాల్గొన్నారు.

క్రిస్మస్ కోలాహలం !

- చర్చిలు, గృహాల వద్ద క్రిస్మస్ కాంతులు
- క్రీస్తు జనన వృత్తాంత నాటికల ప్రదర్శనకు యువత సాధన
- పట్టణంలో జోరుగా క్రిస్మస్ సామగ్రి విక్రయాలు
- ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి వద్ద బాలఏసు పుట్టుక



పట్టణంలోని ఆర్‌సీఎం చర్చి వద్ద క్రిస్మస్ ట్రీ



పట్టణంలోని తెలుగు సెంటినరి బాప్టిస్ చర్చి వద్ద విద్యుత్ దీపాలతో ఆర్చ్, క్రిస్మస్ స్టార్

సత్తెనపల్లి: క్రిస్మస్ కోలాహలం మొదలైంది. ఈ నెల 25న క్రైస్తవులకు పర్వదినం. ఈ నేపథ్యంలో సత్తెనపల్లి నియోజకవర్గంలో క్రైస్తవ మందిరాలు, విశ్వాసుల గృహాలు నూతనత్వాన్ని సంతరించుకున్నాయి. సత్యం, శాంతి, కరుణ, త్యాగం, దయ, ప్రేమ, నిరీక్షణ అనే సందేశాలతో ఏసుక్రీస్తు ఈ లోకానికి కొత్త మార్గాన్ని చూపారు. త్యాగానికి ప్రతీక అయిన క్రిస్మస్ వేడుకను ఈ నెల 25న జరుపుకునేందుకు క్రైస్తవులు సన్నద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే నెల ప్రారంభం నుంచే ఇళ్ల, ప్రార్థనా మందిరాలు, వీధుల్లో స్టార్స్ ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఏసుక్రీస్తును స్తుతిస్తూ ప్రత్యేక ఆరాధనలు, ప్రార్థనలు, సెమీ క్రిస్మస్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నా రు. ఓవైపు సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తూనే ఈ నెల 25 నాటికి క్రిస్మస్ వేడుకలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

జోరుగా విక్రయాలు

సత్తెనపల్లి పట్టణంలోని గడియార స్తంభం సెంటర్, మద్దివారి వీధి, కట్టమూరి వారి వీధి.. ఇలా పలుచోట్ల క్రిస్మస్ స్టార్స్, క్రిస్మస్ ట్రీలు, చర్చిల అలంకరణ సామగ్రి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వివిధ రకాల మోడళ్లు, ధరల్లో ఇవి లభిస్తున్నాయి. ఎలక్ట్రికల్, కాగితం, ప్లాస్టిక్‌తో తయారుచేసిన స్టార్లు మార్కెట్లో లభిస్తున్నాయి. ధరలు రూ. 50 నుంచి రూ. 1000 వరకు ఉన్నాయి. క్రిస్టమస్ ట్రీలు సైజు, నాణ్యత మేరకు రూ. 100 నుంచి రూ.3000 వరకు విక్రయిస్తున్నారు. సండే స్కూల్ పిల్లలు, యువజనులు క్రీస్తు జనన వృత్తాంతాన్ని వివరించే నాటికలు, నృత్యాలు సాధన చేస్తున్నారు. క్రిస్మస్ నాడు సువార్త గీతాలు ఆలపించేందుకు క్రైస్తవ యువత సాధన చేస్తోంది.

ప్రారంభమైన వేడుకలు.

క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఈ నెల అంతా నాటికలు, క్యాండిల్ సర్వీసులు వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. గృహాలు, వ్యాపార సంస్థల వద్ద క్రిస్మస్ స్టార్లు, క్రిస్మస్ ట్రీ, క్రిస్మస్ తాత, క్రిస్మస్ గంటలు, కొవ్వొత్తుల వెలుగులు ఏర్పాటు చేస్తున్నారు.

వెలిగిన క్రిస్మస్ చెట్టు...

క్రిస్మస్ చెట్టును ఇళ్లల్లో, చర్చి సముదాయాల్లో, ప్రధాన కూడళ్ల దగ్గర, ముఖ్య ప్రదేశాల్లో ప్రతిష్ఠించి వేడుకలను ప్రారంభించడం ఆలవాటు. క్రైస్తవులు అధికంగా ఉండే సత్తెనపల్లి పట్టణంలోని పలు చర్చిలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీంతో క్రిస్మస్ పండుగ కళ వచ్చేసింది. చర్చల వద్ద పండుగ వాతావరణం నెలకొంది.

నేడు, రేపు ప్రత్యేక ప్రార్థనలు

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 24, 25 తేదీల్లో పట్టణంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. 24వ తేదీ రాత్రి నుంచి 25వ తేదీ సాయంత్రం వరకు ఆయా చర్చల్లో క్రిస్మస్ వేడుకలను నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి


ముప్పాళ్ల: రెవెన్యూ సదస్సులలో అందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లు, సచివాలయ సిబ్బందితో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో ఇప్పటి వరకు ఐదు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తయ్యాయని, సమస్యలపై అందిన అర్జీల పరిష్కార చర్యలు చేపట్టాలని తహసీల్దార్ తెలిపారు. నీటి తీరువా వసూలు లక్ష్యాలు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్.లక్ష్మీప్రసాద్, మండల సర్వేయర్ సుధాకర్, ఆర్ఐ ఆంజనేయులు, ఆయా గ్రామాల వీఆర్వోలు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రెండు చోట్ల రెవెన్యూ సదస్సులు

ముప్పాళ్ల /అచ్చంపేట: :మండలంలోని మాదలలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరుగుతుందని తహసీల్దార్ ఎం.భవానీశంకర్ సోమవారం తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద ఉదయం 10గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామస్తులు, రైతులు భూ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

==అచ్చంపేట మండలంలోని చిగురుపాడులో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నట్లు తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ సోమవారం తెలిపారు. గ్రామస్తులు, రైతులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.


వైఎస్సార్ సీపీ బ్యానర్లను చించిన దుండగులు



కుంకలగుంటలో చింపిన బ్యానర్

కుంకలగుంట: మండలంలోని కుంకలగుంటలో వైఎస్సార్ సీపీ బ్యానర్లను దుండగులు చించేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గ్రామంలోని పార్టీ కార్యకర్తలు, నాయకులు బ్యానర్‌లను ఏర్పాటు చేశారు. తమ అభిమాన నేత పుట్టినరోజును సంబరంలా జరుపుకున్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన బ్యానర్‌లను రాత్రి వేళ దుండగులు చించివేశారు. దీంతో వైఎస్సార్ సీపీ అభిమానులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. పార్టీ సంయుక్త కార్యదర్శి వనిపెంట వీరారెడ్డి మాట్లాడుతూ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడడం తగదని అన్నారు. పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వ్యాస రచన పోటీల్లో జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



కలెక్టర్ నుంచి బహుమతి అందుకుంటున్న విద్యార్థిని

బెల్లంకొండ: వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ బత్తుల ఉమాదేవి తెలిపారు. స్థానిక కళాశాలలో సోమవారం మాట్లాడుతూ 'వర్చువల్ హియరింగ్, డిజిటల్ యాక్సెస్ టు కన్జ్యూమర్ జస్టిస్' అనే అంశంపై వ్యాసరచన పోటీలలో కళాశాల విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థిని బండారు కల్యాణి ప్రథమ బహుమతి, మొదటి సంవత్సరం విద్యార్థిని షేక్ అఫ్రీన్ తృతీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. వీరికి పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు నగదు పురస్కారం, ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేసినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు.